భీమవరం **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 33.0

కనిష్ఠం : 26.0



యువర్ అటెన్షన్ ప్లీజ్

విజయదశమి నాటికి పట్టాలు ఎక్కనున్న నరసాపురం-చెన్నై వందే భారత్ ఎక్స్‌ప్రెస్

నరసాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):యువర్ అటెన్షన్ ప్లీజ్.. నెంబరు 20678 నరసాపురం నుంచి చెన్నై వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజయదశమి నాటికి బయలుదేరడానికి సిద్ధంగా వుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. షెడ్యూల్ సమయాలను ఖరారు చేస్తూ రైల్వే బోర్డు పచ్చజెండా ఊపింది. విజయవాడ-చెన్నై మధ్య నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయత్నాలు చేసింది. నరసాపురం స్టేషన్‌లో వందే భారత్ నిర్వహణ, నీటి ఫిల్లింగ్‌కు అనువైన సౌకర్యాలు లేవంటూ సదరన్ రైల్వే అడ్డంకులు కల్పిస్తూ వచ్చినప్పటికి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ వీటిని క్లియర్ చేయిస్తూ వచ్చారు. చివరకు రైల్వే మంత్రిని కలిసి వందే భారత్ అవశ్యకత, ట్రాఫిక్‌ను వివరించడంతో రైల్వేబోర్డు పచ్చ జెండా ఊపింది. తొలి విడతలో ఏ ఏ స్టేషన్లలో ఆగుతుందన్న విషయం ఖరారు కావాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం మేరకు నరసాపురంలో మధ్యాహ్నం 2.10కి బయలుదేరి రాత్రి పది గంటలకు చెన్నై చేరుతుంది. మధ్యలో భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతుంది. ప్రస్తుతం ఈ రైలు విజయవాడ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరుతుంది. తాజాగా అదే సమయానికి విజయవాడ చేరుకునే విధంగా నరసాపురం నుంచి షెడ్యూల్‌ను ఖరారు చేస్తున్నారు. ఇక చెన్నై నుంచి ప్రతిరోజు 20677 నెంబర్‌తో ఉదయం 5.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు నరసాపురం వస్తుంది. జిల్లా నుంచి ప్రస్తుతం ఒక సర్కార్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే చెన్నై వెళుతుంది.

ఐదింటికి ఓకే.. ఎనిమిదింటికి నిల్

భీమవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలో రెండో విడత భీమవరంలో 4, నరసాపురంలో ఒక బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వంతున పడ్డాయి. వీటికి గురువారం లాటరీ ద్వారా లైసెన్స్‌దారులను ఎంపిక చేయనున్నారు. ఊహించినట్టే తాడేపల్లిగూడెంలో అధికారులకు నిరాశే ఎదురైంది. తొలివిడతలో మూడు బార్లకు ఖరారయ్యాయి. మలివిడతలో నాలుగింటికి ఒక్క దరఖాస్తు పడలేదు. తణుకులో 3 పెండింగ్‌లోనే ఉన్నాయి. నరసాపురంలో ఒక బార్‌కు ఒక్క దరఖాస్తు పడలేదు. జిల్లాలో 8 బార్లకు దరఖాస్తులు రాలేదు.

చేతి వృత్తులకు తగ్గని ఆదరణ

భీమవరం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):చేతి వృత్తులకు ఎప్పుడూ విలువ, ఆదరణ తగ్గదని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేతి వృత్తులు మన జీవితంలో ఒక భాగమని మనం వాడే వస్తువులు చేతివృత్తుల నుంచి వచ్చినవేనన్నారు.



అధ్యక్షా..

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు..

పశ్చిమలో సమస్యలు అపారం.. ప్రస్తావించనున్న ఎమ్మెల్యేలు

నిధుల విడుదలపై మాట్లాడతా



- తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ఎయిర్‌పోర్టు ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తాను. నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. గూడెం మున్సిపాల్టీలో నిలిచిపోయిన 11 ఎంఎల్ ఫిల్టర్‌ప్లాంట్ పనులు వేగవంతంగా జరిగేందుకు నిధులు విడుదలకు ప్రయత్నిస్తా. కంపోస్టుయార్డు విషయంపైన మాట్లాడతాను.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

ఉపాధి నిధులు ఎక్కువ కేటాయించాలి



- తణుకు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎక్కువ నిధులు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పక్కనున్న ఏలూరు జిల్లాలో రూ.25 కోట్లు కేటాయిస్తే, పశ్చిమ గోదావరికి కేవలం రూ.5 కోట్లు కేటాయిస్తున్నారు. నిధులు పెంచాలని కోరతా. ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి, తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థల సేకరణకు నిధులు, భవన నిర్మాణం, డీఎల్‌కే రోడ్డు నిర్మాణానికి నిధుల విషయంలో అసెంబ్లీలో ప్రస్తావిస్తా. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపైన మాట్లాడతా.

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తాగునీటి మీద చర్చిస్తా



- సముద్ర తీర ప్రాంతం కావడంతో మండలాల్లో తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. వేసవిలో ఈ సమస్య మరింత ఎక్కువ. దీన్ని శాశ్వతంగా పరిష్కారించాలంటే కొత్తగా మంచినీటి ప్రాజెక్టులు చేపట్టాలి. పట్టణంలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లే ఇంకా కొన్ని వార్డుల్లో ఉన్నా యి. కొత్తగా కుళాయి కనెక్షన్లు పెరిగాయి. 70 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు మార్చాలి. వీటితోపాటు బియ్యపుతిప్ప హార్బర్, వశిష్ట వారధి, ఆక్వా యూనివర్సిటీ వంటి పనులు పెండింగ్ పడ్డాయి. పుష్కర పనులపైన అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తా.

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

పోలవరంపై చర్చిస్తా



- కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తోంది. పోలవరంతోపాటు ఇతర ప్రాజెక్టులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా ఎలాంటి చర్యలు తీసుకున్నామో అసెంబ్లీలో వివరిస్తా. కనకాయలంక కాజ్ వే బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైన రూ.24 కోట్లు త్వరితగతిన విడుదలయ్యే చూస్తా. బ్రిడ్జిని పూర్తి చేసి దశాబ్దాలుగా వరదల నివారణ చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తా.

- డాక్టర్ నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ మంత్రి, పాలకొల్లు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



- నియోజకవర్గం సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా. ఇప్పటికే ఎన్నో సమస్యలను అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లా. మావుళ్ళమ్మ ఆలయ భద్రత వంటి విషయాలను ప్రస్తావించా. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్‌ల నిర్మాణం అవసరాన్ని వీటన్నింటిని అమలు చేసే విధంగా అసెంబ్లీ దృష్టికి తీసుకుని వస్తా.

- పీఏసీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

సమస్యలు ప్రస్తావిస్తా



- నక్కల మురుగు కాలువ గోదావరిలో కలిసే లక్ష్మీపాలెం వద్ద గేట్ల పునరుద్ధరణకు ప్రయత్నిస్తా. రహదారుల నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించా. కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మండలానికి ఒక డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అసెంబ్లీలో చర్చిస్తా.

- ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

భీమవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నో సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోలేదు. భీమవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడటంతో ప్రజల్లో సరికొత్త ఆకాంక్షలు రేకెత్తుతున్నాయి. వాటి పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తామని చెబుతున్నారు. భీమవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నూతన కలెక్టరేట్ నిర్మాణం చేపట్టాలి. ఉప్పుటేరు డ్రెడ్జింగ్ కోసం కొత్త ప్రతిపాదనలు చేస్తున్నారు. సర్వే చేపడుతున్నారు. దీనికి నిధులు కేటాయించాలి. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ప్రభుత్వం ఆశిస్తోంది. మరోవైపు కొల్లేరు సరస్సు భద్రంగా ఉండాలంటే ఉప్పుటేరుపై రెగ్యు లేటర్లు ఏర్పాటు చేయాలి. వైసీపీ హయాంలో మూడు రెగ్యులేటర్ల నిర్మాణం కోసం సన్నాహాలు చేశారు. టెండర్లు పిలిచారు. కానీ పనులు చేయలేకపోయారు. అసెంబ్లీ వేదికగా ఉప్పుటేరు నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు ప్రస్తావించనున్నారు.

విమానాశ్రయం.. చిరకాల ఆకాంక్ష

విమానాశ్రయం ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష. కూటమి పార్టీలు తాడేపల్లిగూడెంలో ఏర్పాటుకు హామీ ఇచ్చాయి. ఈ మేరకు తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం, జగన్నపేట గ్రామాల్లో భూములను గుర్తించింది. కాని అడుగు ముందుకు పడలేదు. దీనిని ప్రస్తావిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చెబుతున్నారు.

డెల్టా ఆధునికీకరణ దిశగా..

పశ్చిమ డెల్టా ఆధునికీకరణ అసంపూర్తిగా మిగిలింది. గత ప్రభుత్వాలు రూ.800 కోట్లతో పనులు పూర్తిచేశారు. మరో రూ. 800 కోట్లు వెచ్చిస్తే కాల్వల పూడిక తీత, గట్ల పటిష్టత, రివిట్‌మెంట్ వాల్స్ నిర్మాణం, మురుగు కాల్వల ప్రక్షాళన వంటి పనులు పూర్తవుతాయి. జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళుతున్నా ఉన్నతాధికారులు ఏదో ఒక కొర్రీ వేస్తూ మోకాలడ్డుతున్నారు. దీనిపై దృష్టి సారించారు.



రోడ్ల అభివృద్ధి జరిగేనా

జిల్లాలో రహదారుల అభివృద్ధి మళ్లీ పడకేసింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదంటూ కొత్త పనులు చేపట్టడం లేదు. ప్రతీ నియోజకవర్గం నుంచి రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఎప్పటిలాగే రోడ్లు గుంతులు పడుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ఫలితం కానరావటం లేదు. లోసరి నుంచి భీమవరం మీదుగా తాడేపల్లిగూడెం రహదారి అభివృద్ధికి కేంద్రం రూ 100 కోట్లు మంజూరు చేసింది. దానికి పరిపాలనా అనుమతి ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. దీనిని పరిష్కరించాలి.

కొలిక్కిరాని కలెక్టరేట్

జిల్లాలో కలెక్టరేట్ నిర్మాణాలు ఒక కొలిక్కి రాలేదు. ప్రభుత్వమే నిధులు కేటాయించి భీమవరం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ నిర్మించాల్సి ఉంది. స్థలాన్ని గుర్తించడంలోను, వివాదం ఏర్పడుతోంది. కూటమిలో ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై స్పష్టత రావాలి.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి లక్షల కోట్లు

- స్వస్థ నారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఆకివీడు సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):దేశంలో స్త్రీ శక్తి బలోపేతానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మోదీ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ, స్వశక్తి పరివార్ అభియాన్ నిర్వహించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్మ మాట్లాడుతూ గర్భిణులు, శిశువులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని చెప్పారు. తల్లీ బిడ్డా ఆరోగ్యానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతోకూటమి ప్రభుత్వం వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మహిళలకు బాల్యం, కౌమారం, యవ్వనం, నడివయ స్సు వృద్ధాప్య దశలలో ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ నిర్వహిస్తోందన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ స్త్రీలను ఎక్కడ పూజించి, గౌరవిస్తారో అక్కడ దేవతలు సంచరిస్తారనే నానుడిని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తోందని, అందుకే కేంద్ర-రాష్ట్రాలు సస్య శ్యామలంగా ఉన్నాయన్నారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాట్లాడుతూ అక్టోబరు రెండో తేదీ వరకు జిల్లాలో ప్రతీరోజూ 471 ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాలను వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి ఈ.ప్రశాంత్, డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, మెడికల్ అధికారి ఆదిలక్ష్మి, గణేష్, వైద్యులు బిలాల్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వాణివిజయ రత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, గంధం ఉమా, నౌకట్ల రామారావు, పిల్లా బాబులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం కిట్లు అందజేశారు. మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తులకు పండ్లు పంచి, మొక్కలు నాటారు. విశ్వ కర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, కలెక్టర్ నాగరాణి తదితరులు

పారిశుధ్యానికి ప్రాధాన్యం

- మంత్రి పి.నారాయణ

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను వైసీపీ ప్రభుత్వం మిగిల్చి వెళ్లింది. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డులా తయారు చేసింది. రోజుకు 50 వేల టన్నుల చెత్తను తొలగిస్తున్నాం. భూమిపైనే కాదు.. లోపల మరో 15 లక్షల టన్నుల చెత్త ఉంది. నవంబరు నెలాఖ రుకు దానిని తొలగించే చర్యలు తీసుకుంటాం' అని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. పోణంగిలోని డంపింగ్ యార్డును, ఏలూరు టిడ్కో గృహాలను సందర్శించారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి వచ్చే ఏడాది జూన్ నాటికి దశల వారీగా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బడేటి మాట్లాడుతూ వైసీపీ హయాంలో డంపింగ్ యార్డులోని చెత్తను కాల్చి పర్యావరణానికి హాని కలిగించారని, దీనివల్ల చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో చెత్తను ఎరువుగా తయారు చేసి వినియోగిస్తున్నామన్నారు. మేయర్ నూర్జహాన్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, కమిషనర్ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి, మేయర్ నూర్జహాన్

జడ్పీ చైర్‌పర్సన్‌తో



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. ఉమ్మడి జిల్లా జడ్పీ పరిధిలోని ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు, జడ్పీ పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి, గ్రామాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజలు సెల్ నెంబరు 94947 86277కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. వాటి పరిష్కారానికి ఆమె తగిన చర్యలు తీసుకుంటారు.

రోగులు ఎక్కువ.. సిబ్బంది తక్కువ

- పీహెచ్‌సీలను వేధిస్తున్న కొరత
- అందని మెరుగైన సేవలు
- పెంటపాడులో మరింత ఘోరం



పెంటపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రతిరోజు రోగులతో కిక్కిరిసి వున్న ఆరోగ్య కేంద్రాలలోను అరకొర సిబ్బంది ఉండటం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలలో ప్రధానంగా పనిచేసే శాఖల్లోనే ఈ కొరత ఎక్కువగా ఉంది. వచ్చిన రోగులకు సర్ది చెప్పలేక ఉన్న సిబ్బంది నానా అగచాట్లు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 34 ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 366 హెల్త్ వెల్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రి, నాలుగు ఏరియా ఆసుపత్రులు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ప్రతీరోజు అనేక మంది వైద్య సేవలు పొందుతుంటారు. సిబ్బంది కొరత కారణంగా ప్రతీ రోజు రోగులకు వైద్య సేవలు లభించడం లేదు. ఉన్న వారే వారికి వైద్యం చేసి పంపిస్తున్న పరిస్థితి నెలకొంది

ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత

జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో 14 మంది ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరత ఉంది. రోగులకు ఆసుపత్రిలో వైద్య

మిగతా 8వ పేజీలో..

డిప్యుటేషన్లతో కాలక్షేపం

- ఆకివీడు మండల కార్యాలయాల్లో ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు.. సేవలందక ప్రజల ఇక్కట్లు



ఆకివీడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆయా మండలాల్లో పాలన స్తంభించింది. పనులు ముందుకు సాగడం లేదు. డిప్యుటేషన్లపై రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది చాలా మంది బదిలీలు లేదా పదవీ విరమణ చేశారు. వారి స్థానాల్లో కొత్త వారిని భర్తీ చేయకపోవడంతో డిప్యుటేషన్లపైనే ఆయా శాఖలు పనిచేస్తున్నాయి. దూరప్రాంతాలకు బదిలీ అయిన వారిని ఇక్కడకు డిప్యుటేషన్ వేయడంతో ఎక్కడ పనిచేయాలో తెలియక వారు సతమతం అవుతున్నారు. దీంతో ఆయా అధికారులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉదాహరణకు ఆకివీడు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, పౌరసరఫరాల డీటీ, జూనియర్ అసిస్టెంట్, ముగ్గురు వీఆర్వోలు, ఎంఎస్‌వో, ఎంపీడీవో, ఏఈ, డిజిటల్ అసిస్టెంట్లు, ఇరిగేషన్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఆర్‌అండ్‌బీ ఏఈ, హౌసింగ్ ఏఈ, అగ్రికల్చరల్ ఏవో, ఎఫ్‌డీవో ఇలా పలు శాఖల్లో అధికారులు లేరు. కిందిస్థాయి సిబ్బంది ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్నారు. ఇన్ చార్జీలుగా దూరప్రాంతాల్లోని అధికారులను నియమించడంతో వారు వచ్చి వెళ్లడానికే సమయం సరిపోతోంది. ఇక ప్రజలకు సేవలు ఎక్కడ అందుతాయి.

రాయితీ పెరిగింది..

ఇల్లు కట్టేద్దాం

- ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు
- పట్టణాల్లో 595 మంది లబ్ధిదారులకు మంజూరు

భీమవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రధాన మంత్రి ఆవాస యోజనలో భాగంగా పట్టణాల్లో ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. జిల్లాలోని అన్ని పట్టణాల్లోను 595 ఇళ్లు కేటాయించింది. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు పట్టణాల్లో 613 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 595 పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీ) కింద వీటిని మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు పీఎంఏవైలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇచ్చే రాయితీని పెంచింది. గత వైసీపీ హయాంలో రూ.1.80 లక్షలు రాయితీ ఇచ్చేవారు. కూటమి హయాంలో దీనిని రూ.2.50 లక్షలకు పెంచారు. అందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో లక్ష రాయితీ భరిస్తోంది. దీనికితోడు ఉపాధి హామీ పథకంలో మరో 40 వేలు లేబర్ ఛార్జీల కోసం చెల్లించనున్నారు. మొత్తంగా రాయితీ పెరగడంతో ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వస్తారని లబ్ధిదారులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లావ్యాప్తంగా ఆరు వేల 712 మంది లబ్ధిదారులు సొంత ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. పట్టణాల్లో 613, పల్లెల్లో ఆరు వేల 99 మంది ఉన్నారు. ప్రస్తుతం పట్టణ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించగా, త్వరలో గ్రామీణ లబ్ధిదారులకు మంజూరు కానున్నాయి. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం రూ.2.50 లక్షల రాయితీతో ఇళ్లు మంజూరు చేస్తుంది.

పట్టణాలు..	మంజూరైన ఇళ్లు
తణుకు	111
నరసాపురం	75
భీమవరం	85
పాలకొల్లు	60
తాడేపల్లిగూడెం	149
ఆకివీడు	115


తణుకు ఇంద్రయ్య కళాశాలలో ఉద్యోగ మేళాకు హాజరైన అభ్యర్థులు

ఉద్యోగ మేళాలో 60 మంది ఎంపిక

తణుకు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజి నందు జరిగిన ఉద్యోగ మేళాలో 60 వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు చెప్పారు. కళాశాల్లో జరిగే జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమ భవిష్యత్ అభివృద్ధికి ఒక సుస్థిరమైన వేదికగా మార్చుకోవాలని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ లోకమన్‌తో పాటు పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 172 మంది అభ్యర్థులు హాజరవగా 60 మంది ఎంపికైనట్లు వివరించారు. స్పెషలాఫీసర్ ప్రభాకర్, నాగభూషన్‌రెడ్డి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


నీలాద్రిపురంలో ఆదరాబాదరాగా బస్తాలు కడుతున్న రైతులు

అన్నదాతను వెంటాడుతున్న వాతావరణం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలంలో వరిమాసూళ్లు ముమ్మరంగా సాగుతుండగా వాతావరణం భయపెడుతోంది. ఉదయం ఎండగా ఉందని కోతలు మొదలు పెట్టిన రైతులకు మధ్యాహ్నం మబ్బులు వేసి చినుకులు పడుతూ రైతుల్లో గుబులు రేపుతోంది. ఒకపక్క సరైన ధర లేక రైతులు అయిన కాడికి అమ్ముకుందామని మాసూళ్లు చేస్తుంటే ఈ వాతావరణం మరింత ఇబ్బంది పెడుతోంది. కొందరు దళారులు ఇదే అదనుగా ధాన్యం ధరల్లో కోతలు పెడుతున్నారు. రూ.1350 ఉన్న ధరను రూ.1200 అని చెబుతూ రైతులను దోచుకుంటున్నారు.


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్లకూరు వెంకన్న పవిత్రోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రెండవ రోజైన బుధవారం స్వామి, అమ్మవార్లకు అగ్ని ప్రతిష్ఠ, కుంభావాహన, యాగశాల అర్చన, ప్రత్యేక హోమాలు,సాయంత్రం స్వామి,అమ్మవార్లకు పవిత్రాల సమర్పణ, తీర్థ గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో మోకా అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ 35.19 లక్షలు

భీమవరం టౌన్,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయంలో బుధవారం జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్యప్రకాష్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కించారు.. రెండు నెలలు కాలానికి 35 లక్షల 19 వేల 016 రూపాయలు ఆదాయంగా వచ్చింది దీంతో పాటు బంగారం 51 గ్రాములు, వెండి 160 గ్రాములు వచ్చింది. 121 అమెరికా డాలర్‌లు, 10 కెనడా డాలర్‌లు వచ్చినట్టు దేవస్థానం ఈవో బుద్ద మహాలక్ష్మీ నగేష్ తెలిపారు.. దేవదాయ శాఖ ఇనస్పెక్టర్ వెంకటేశ్వరావు, దేవస్థానం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ, కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ గ్రంధి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.15 లక్షలు



మొగల్తూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 60 రోజులకు గాను రూ.15 లక్షల 72 వేల 090 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో కృష్ణంరాజు పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరిపినట్టు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.


మొగల్తూరులో నడివీధి ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు,గ్రామస్థులు

నడివీధి ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠ పూజలు

మొగల్తూర, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ ఆలయ పూరిపాక, ఘటాలు దగ్ధం అవడంతో వాటి స్థానంలో నూతనంగా పూరిపాక, ఘటాలు పున ప్రతిష్ఠించేందుకు బుధవారం నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రముఖ సిద్ధాంతి అనిల్ కుమార్ ఆచార్యులు సూచించిన విధంగా బుధవారం ఉదయం 10.40 నిమిషాలకు కొబ్బరికాయ కొట్టి పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 29న పున ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎటాక్ చేస్తే ఏం చేయాలి ?

చిన వెంకన్న సన్నిధిలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో బుధవారం ఆక్టోపస్ బలగాలు హడావుడి చేశాయి. ఆలయంలోకి ఉగ్రవాదులు ఆకస్మిక దాడులు చేస్తే ఎలా ఎదుర్కోవాలి..? భక్తులను ఎలా రక్షించాలి ? ఆలయ ఆస్తులను ఎలా కాపాడాలనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అలాంటి పుణ్యక్షేత్రంలో ఉగ్రవాదులు ముప్పేట దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలి? అర్ధరాత్రి లేదా భక్తులు రద్దీగా ఉండే సమయంలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే ఎలా తిప్పికొట్టాలనే విషయాలపై అవగాహన కల్పించేందుకు ఆక్టోపస్ బలగాలు ఆలయ ప్రాంగణంలో మాక్ డ్రిల్ చేశాయి. ఆక్టోపస్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు, ఆలయ అధికారులు ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం వద్ద బుధవారం రాత్రి ఆక్టోపస్ బృందం చేపట్టిన మాక్ డ్రిల్ దృశ్యాలు

అంగన్‌వాడీల్లో అద్దె కష్టాలు

జిల్లాలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. జిల్లాలో 1626 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 489 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కొన్నిటిని పాఠశాలు, కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్నారు . చాలా కేంద్రాల్లో సౌకర్యాలు , సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు...


అత్తిలిలో కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్


యర్రాయి చెరువులో మహిళా మండలి భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

ఇరగవరం మండలంలో 31 కేంద్రాలు అద్దె గదుల్లోనే..

ఇరగవరం (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలంలో నిర్మించిన అంగన్ వాడీ భవనాలు అసంపూర్తిగా వదిలేయడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని 71 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో సుమారు 31 కేంద్రాలు అద్దె గదుల్లోనే కొన సాగుతున్నాయి. అద్దె భవనాలు ఉన్నచోట అసౌకర్యాల నడుమ విద్యాబోధన సాగుతుంది. ఇరుకు గదులు కావడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని యర్రాయిచెరువు, కంతేరు గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి టీడీపీ హయాంలో ప్రతిపాదనలు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రారంభించిన పనులు బేస్‌మెంట్ లెవెల్‌లో వదిలేశారు. అవి పాడైపోతున్నాయని కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అరకొర సౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు

అత్తిలి (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేక చిన్నారులు కొట్టుమిట్టాడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో పాటు అన్ని వసతులు కలిగిన భవనాలు ఉండాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ జిల్లాలో కొన్నిచోట్ల కమ్యూనిటీ హాల్స్, ప్రార్థనా మందిరాల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ సౌకర్యాలు లేక చిన్నారులు ఇబ్బందుల పాలవుతున్నారు. కమ్యూనిటీ హాల్స్, సామాజిక భవనాలు, ప్రార్థనా మందిరాల్లో నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు అద్దె నిమిత్తం నిధులు జమ చేయడం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి. ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి. అత్తిలి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని ఉన్న చెరువులో ఇటీవల చిన్నారి పడి మృతి చెందడం అందరినీ కలిసి వేసింది. కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్టు అధికారి శ్రీలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. కాలువలు, చెరువులు, రహదారుల మూడు రోడ్ల కూడలిలోను అంగన్‌వాడీ కేంద్రాలు లేకుండా చూస్తామని వెంటనే వాటిని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.


చిన్నారి మృతికి కారణమైన చెరువు

పెరిగిన వ్యయం.. భారమైన మెనూ

అత్తిలి (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో కార్యకర్తలకు భారంగా మారింది. పాత ధరల ఆధారంగా బిల్లులు చెల్లిస్తుండడంతో వంట ఖర్చులకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. కేంద్రాల్లో పౌష్టికాహారం ఇచ్చే ధరలను పెంచాలని పలువురు వినతులు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూలు పిల్లలకు ఆహారం కోసం కూరగాయలు, ఆకుకూరలు, పసుపు, చింతపండు, కారం, పోపు తదితర సామాగ్రి ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని వీటి కొనుగోలుకు ఒక చిన్నారిపై వారానికి రూ.50 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇవి ఏమాత్రం సరిపోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. వారానికి ఒకరికి బియ్యం 75 గ్రాములు, వంట నూనె రూ. 5, కందిపప్పు 15 గ్రాములు, కూరగాయలు, పోపులకు రూపాయిన్నర, గ్యాస్‌కు రోజుకి 50 పైసలు చొప్పున ఇస్తున్నారు. సిలిండర్ రూ. 887 కొనుగోలు చేస్తున్నామని ప్రస్తుతం పెరిగిన ధరలు కారణంగా మెనూ ప్రకారం వండి పెట్టాలంటే అదనపు భారం తప్పడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం దోసకాయపప్పు, మంగళవారం టమాటా పప్పు, బుధవారం ఆకుకూర పప్పు, గురువారం కూరగాయలతో సాంబారు, శుక్రవారం బీరకాయ లేదా సొరకాయ పప్పు, శనివారం వెజిటబుల్ బాత్ రైస్ పెట్టాలి. ఈ మెనూకు 2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వీటి ధరలు మూడు రెట్లు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత బకాయిలు చెల్లించారని కొత్త ధరలు ప్రకారం బిల్లులు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

సొంత భవనాలకే సౌకర్యాలా ?

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు

అద్దె భవనాలకు మొండిచెయ్యి..!

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): పూర్వ పాఠశాల స్థాయి పిల్లలకు పోషకాహారం, ఆట పాటలతో కూడిన విద్యనందించేందుకు ఉద్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాలలో ఫర్నీచరు, ఇతర ఆట వస్తువులు సొంత భవనాలకే అందించడంపై అనుమానాలు ఏర్పడుతున్నాయి. ప్రతీ వెయ్యి మంది జనాభాకు ఒక కేంద్రం చొప్పున జిల్లాలో సుమార 1620 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడం,నిధుల కొరత కారణంగా జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలల్లో ఎక్కువగా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీ, చైల్డ్ టేబుల్, కుర్చీలు, వాటర్ ప్యూరిఫైర్, ఐరన్ ర్యాక్స్, బెడ్ షీట్, బ్లాక్ బోరు వంటి వస్తువులతో పాటు ఆట వస్తువులు, ఇతర అవసరాలకు సంబంధించి మొత్తం 8 రకాల వస్తువులను అందించింది. అయితే వాటిని కేవలం సొంత భవనాలు వున్న అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే అందించడం పట్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారనే భావనతో ఆయా కేంద్రాల పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు అన్ని సౌకర్యాలను సమాన ప్రాతిపదికన అందించాలని కోరుతున్నారు.


ఫర్నీచర్, ఆట వస్తువులు



దువ్వ అంగన్‌వాడీ కేంద్రం

సౌకర్యాలు అందరికీ కల్పించాలి



ప్రభుత్వం సౌకర్యాలను అందరికీ అందించాలి. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించిన పర్నీచరు, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనం, అద్దె భవనం అనే తారతమ్యం లేకుండా చూడాలి. అద్దె కేంద్రాలలో వుండే పిల్లలకు కూడా అందించాలి.

-బళ్ల చిన వీరభద్రరావు, వేల్పూరు.

489 కేంద్రాలకు అందించాం

జిల్లాలోని మొత్తం 1620 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను సొంత భవ నాలలో నిర్వహిస్తున్న 489 కేంద్రాలకు ప్రీస్కూల్ కిట్లను అందించారు. జిల్లాలో సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే వీటిని పంపిణీ చేశారు.

-ఎం.శ్రీలక్ష్మీ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, భీమవరం

ముంచెత్తుతున్న కడప ఉల్లి

గూడెం మార్కెట్‌కు ఏడు లారీల్లో రాక



తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) తాడేపల్లిగూడెంలో కడప ఉల్లి ముంచెత్తుతోంది. కడప నుంచి ఏడు లారీల్లో సుమారు 110 టన్నుల ఉల్లిని తీసుకొచ్చారు. దీని ధర క్వింటా రూ.650 నుంచి 1200 మధ్య హోల్‌సేల్‌గా పలికింది. కర్నూలు ఉల్లి తగ్గిపోయింది. మరోసారి కర్నూల్లో వర్షాలు రావడంతో అక్కడ ఉల్లి పూర్తిగా పాడైపోవడంతో రైతులు పంట తీయడం మానేసి మేకలతో మేపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉల్లి తీస్తే కనీసం కూలీ కూడా గిట్టదనే ఉద్దేశంతో కొంతమంది దున్నేస్తున్నట్లు వ్యాపారులు చెబుతు న్నారు. నష్టపోయిన కర్నూలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేసింది. దీన్ని మార్కెట్లకు తీసుకొస్తే కొనేవాళ్లు లేక పార బోయాల్సి వచ్చింది. ఇటీవల మళ్లీ కర్నూలో భారీ వర్షాలకు పొలాల్లో తీయకుండా వదిలేసిన ఉల్లి మరోసారి మునిగింది. మార్కెట్ పరిస్థితులపై మార్కెటింగ్ శాఖ డీడీ పాపారావు, తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డు సెక్రటరీ గౌస్‌భాషా, సూపర్‌వైజర్లు ఫణికిషోర్, వెంకటేశ్వరరావులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. మహారాష్ట్ర ఉల్లి 150 టన్నులు వచ్చింది. దీన్ని ఆరు లారీల్లో తీసుకొచ్చారు. వీటి ధర నాణ్యత, సైజు ఆధారంగా క్వింటా రూ.1200 నుంచి 1700 మధ్య విక్రయాలు జరిగాయి.

చికెన్ ధరలకు రెక్కలు

స్కిన్‌లెస్ కిలో రూ.260..విత్ స్కిన్ రూ.240



తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చికెన్ ధరలు చుక్కలు చూపుతున్నాయి. గత సంవత్సరం ఇదే సమయంతో పోల్చుకుంటే కిలోకు రూ.80 పెరిగింది. రైతుల దగ్గర కోళ్లు లేకపోవడం ధర పెరగడానికి ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. పండగ సీజన్లో ధర తక్కువగా ఉండటంతో వీటిని తక్కువ సంఖ్యలో పెంచారు. వినియోగం ఎక్కువ.. కోళ్లు తక్కువగా ఉండటంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.260, విత్‌స్కిన్ రూ.240కు విక్రయాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం ఇదే సమయానికి స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.180, విత్‌స్కిన్ రూ.160కు విక్రయించారు. రైతుల వద్ద కోళ్లు తక్కువగా ఉండడంతో కార్పోరేట్ సంస్థలు ధరను నిర్ణయిస్తున్నాయి. జంగారెడ్డి గూడెం, నల్లజర్ల, కొయ్యలగూడెం, చిన్నతిరుపతి, కామవరపుకోట ప్రాంతాల నుంచి ఎక్కువగా కోళ్లను మార్కెట్‌కు పంపిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో ఇప్పుడు కోళ్లు తక్కువగా ఉన్నాయి. దీంతో ఒక్కసారిగా ధర పెంచారు. రెండు వారాల కిందటి వరకు కిలో స్కిన్‌లెస్ కిలో రూ.220, విత్ స్కిన్ ధర రూ.200 ఉండేది. రెండు వారాల సమయంలో ఏకంగా కిలోకు రూ.40 పెంచేశారు. దీంతో లొట్టలేసుకుని తినే చికెన్ ప్రియులు కిలో పట్టికెళ్లేవారు అరకిలోకు పరిమితమవు తున్నారు. పండగ సీజన్‌లో ధరలు ఇలా ఉంటే పండుగ వెళ్లిన తరువాత ధరలు ఎలా ఉంటాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.


ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న మార్టేరు ఏడీఆర్ సీహెచ్ శ్రీనివాస్, ఉండి కేవీకే శాస్త్రవేత్తల బృందం

మిద్దె తోటలతో ప్రయోజనాలెన్నో

ఉండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటల పెంపకంతో ఖర్చులు తగ్గడంతో పాటు అదనంగా ఆదాయం పొందవచ్చని మిద్దె తోటలపై అవగాహన పెంచుకోవాలని అవసరం వుందని మార్టేరు ఏడీఆర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ డిబోరా మెషియానా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణాలలో భూమిలేని పరిస్థితుల్లో మొక్కల పెంపకానికి మిద్దెతోటలు ఎంతో ప్రయోజనకరమన్నారు.అవగాహన పెంచుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ కేవీకేలో అందిస్తున్న వివిధ రకాల శిక్షణ, సేవల గురించి వివరించారు. యూని యన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజరు వేణుగోపాల రావు మాట్లాడుతూ తన ఇంటి వద్ద మిద్దెతోటల పెంపకంపై గల అనుభవాలను వివరించారు.ఉండి, భీమవరం, ఆకివీడు, తణుకు ఇతర పరిసర ప్రాంతాల నుంచి మహిళలు విచ్చేశారు.పెదపుల్లేరు యూనియన్ బ్యాంక్ మేనేజరు బి.నీలాద్రిరాజు, కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, డా.బిందుప్రవీణ, డా.వినయ్‌లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పెంచుతున్నా



పండ్ల మొక్కలను పెంచుతున్నాను. ఈ మధ్యే మిద్దెతోటల పెంపకం చేపట్టాను. వీటి వల్ల ఎంతో ఉపయోగం వుంది. మిద్దె తోటలతో ఆదాయం పొందవచ్చు.

కంచర్ల తేజ, భీమవరం

ఖర్చులు ఆదా అవుతాయి



మిద్దెతోటల పెంపకంతో ఖర్చులు ఆదాఅవుతాయి. కొంచెం స్థలం వుంటే చాలు పలురకాల కూరగాయలను పండించవచ్చు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను.

కట్రెడ్డి అనూష, అజ్జమూరు



ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

అక్టోబర్ 11, 12 తేదీల్లో కరాటే పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అక్టోబరు 11, 12 తేదీల్లో ఆల్ ఇండియా షోటోఖాన్ కరాటే ఛాంపియన్‌షిప్ (బడేటి కప్) నిర్వహించనున్నారు. బుధవారం పోటీలకు సంబంధించి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్‌కు తన సోదరుడు దివంగత బడేటి బుజ్జి గౌరవ అధ్యక్షుడిగా ఉండి కరాటే క్రీడకు వన్నె తీసుకొచ్చారని అన్నారు. ఆయన పేరుతో బడేటి కప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. షాహిన్, డీఎల్ నారాయణ, ఇబ్రహీం బేగ్, అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ, ఎస్ సుహాస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే ఎంపిక పోటీలు నిర్వహించారు.



వివిధ పోటీలకు జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులతో వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, పీడీలు

రాష్ట్రస్థాయి పోటీలకు వేల్పూరు విద్యార్థులు

తణుకు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో తణుకు రూరల్ మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణ తెలిపారు. ఈనెల 16వ తేదీన ఏలూరులో జరిగిన జిల్లా జట్ల ఎంపిక పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్విమ్మింగ్‌లో అండర్-14 విభాగంలో దినేష్ కార్తీక్, నీరజ్, ఆనందరావు, రాకేష్, కార్తీక్‌లు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా త్వరలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా జట్టులో పాల్గొంటారని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జల్లా జట్ల ఎంపిక పోటీల్లో సాహిత్ ప్రియదర్శిని, మోక్షానంద స్వరూప్, సాయి వెంకట వినాయక సాత్విక్ విజేతలుగా నిలిచారని ఈనెల 27, 28, 29 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. వివిద పోటీలలో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ శిరీషా, హెచ్ఎం రాధాకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు.

పెన్‌డౌన్ దిశగా దస్తావేజు లేఖర్లు

ఆచంట,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2.0 రిజిస్ట్రేసన్ విధానంలో ఆధార్ ఓటీపీ, ఇతర లోప భూయిష్టమైన విధానాల వలన ఓటీపీలు చెప్పేందుకు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దస్తావేజు లేఖర్లు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఓటీపీ విధానానికి స్వస్తి చెప్పి రిజిస్ట్రేషన్‌లు చేయాలని ఇప్పటికే దస్తావేజు లేఖర్లు ప్రభుత్వం ఒత్తిడి తీసుకు వస్తున్నారు.ఆయా జిల్లాల్లో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలపడానికి సిద్ధపడుతున్నారు. నెల్లూరు జిల్లాలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. వారికి మద్దతుగా రాష్ట్రంలో అనేక చోట్ల నిరసన చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 19,20 తేదీల్లో రెండు రోజులు పాటు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇప్పటికే నరసాపురం దస్తావేజుల సంఘం కమిటీ తీర్మాణం చేశారు.కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు పాల్గొనాలని క్రయ విక్రయదారులు కూడా సహకరించాలని కోరుతున్నారు.



ఉండి ఆర్అండ్‌బీ బంగ్లాలోని ప్రభుత్వ భూమికి సంబంధించి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టరు నాగరాణి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు

ప్రభుత్వ స్థలాలకు సరిహద్దు రాళ్లు వేయండి

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు నాగరాణి

ఉండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను సర్వే చేసి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయించాలని రెవెన్యూ అధికారులకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. బుధవారం ఉండి ప్రభుత్వ స్థలాలైన ఇరిగేషన్, పీడబ్ల్యుడీ, జడ్పీ స్థలాలను ఆమె పరిశీలించారు. ఉండి అక్విడెక్టు వద్దకు విచ్చేసి ఆక్రమణలు తొలగించిన ప్రాంతాలను, రింగ్‌రోడ్ మార్గాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు వుంటే గుర్తించి సంబంధిత యజమానులకు ముందుగా నోటీసులు జారీ చేయాలని అనంతరం తొలగించాలని ఆదేశించారు.ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఉండి తహసీల్దారు నాగార్జున, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఆందోళన బాటలో విద్యుత్ ఉద్యోగులు

భీమవరంటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 2004 వరకు ఉద్యోగం పొందిన వారికి జీపీఎఫ్ కొనసాగించాలని, జెఎల్ఎం గ్రేడ్-2లను పర్మినెంట్ చెయ్యాలని, కరువు భత్యాలను వెంటనే విడుదల చెయ్యాలని నినాదాలు చేశారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. జేఏసీ నాయకులు శ్రీకాంత్, చలపతిరావు, శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, శ్రీనివాసరాజు, రాంబాబు, సురేష్, కుటుంబ రావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడికే మెగా లబ్ధి

- నేడు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ అభ్యర్థులు ఏలూరు చేరిక
- అమరావతి వెళ్లేందుకు 2,292 మందికి వసతి, ప్రయాణ ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు అత్యధికులు ఉద్యోగాలు పొందారు. మెగా డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులకు శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అందజేయనున్న నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి ఏలూరు నుంచి పంపించేందుకు ప్రయాణ ఏర్పాట్లు, వసతి, తదితర అంశాలపై బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి 1063 మంది అభ్యర్థులు, జోనల్ పోస్టులకు 83 మంది ఎంపికయ్యారని, మొత్తం 1146 మంది అభ్యర్థులతోపాటు, వారికి తోడుగా ఒక్కొక్క సహాయకులను కలిపి మొత్తం 2292 మందిని ఏలూరు నుంచి అమరావతికి తీసుకెళ్లి, తిరిగి తీసుకొచ్చేందుకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఏలూరులో 18వ తేదీ రాత్రి ఆహారం, 19న ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించి తీసుకెళ్లాలన్నారు. ప్రయాణ ఏర్పాట్లకు తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో ఇదంతా జరగాలని సూచించారు. సమావేశంలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, డీపీటీవో ఎస్కే షబ్నమ్, ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మన్‌రాజు, నగరపాలకసంస్థ కమీషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.



వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఆరుగురు అభ్యర్థులకో సూపర్‌వైజర్

ఏలూరులోని 10 పాఠశాలల్లో వీరికి వసతి, ప్రయాణ ఏర్పాట్లు కల్పించడంలో లోటుపాట్లు తలెత్తకుండా విద్యాశాఖ చర్యలను చేపట్టింది. ప్రతీ ఆరుగురు అభ్యర్థులు, వారి సహాయకులకు నిర్దేశిత వసతులన్నీ అందేలా పర్యవేక్షించేందుకు ఒక సూపర్‌వైజర్ చొప్పున నియమించింది. అభ్యర్థులకు కేటాయించిన పాఠశాలల వివరాలను గురువారం ఉదయమే ఫోన్లలో సమాచారమిస్తారు. వీరంతా తమకు కేటాయించిన పాఠశాలకు వారి సహాయకులతోసహా గురువారం సాయంత్రం 4గంటలకల్లా రిపోర్ట్ చేసి రిజిస్టర్ చేయించుకోవాలి. అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను కౌంటర్‌లో ఇస్తే గుర్తింపు కార్డు ఇస్తారు. పాఠశాల తరగతి గదిలో నిద్రించేందుకు వీలుగా బ్లాంకెట్, తదితర సామగ్రిని తెచ్చుకోవాలని విద్యాశాఖ సూచించింది. ఎవరైనా అభ్యర్థులు రిసీవింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఐడి కార్డు తీసుకున్న తర్వాత రాత్రి బస చేయడానికి ఆసక్తి కనబరచకపోతే అక్కడి అధికారుల అనుమతి తీసుకుని వెళ్లిపోయేందుకు వెసులుబాటు కల్పించారు. సొంత వసతి ఏర్పాట్లు చేసుకున్న వారంతా 19న ఉదయం 7 గంటలకల్లా రిసీవింగ్ సెంటర్‌లో తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలి. శుక్రవారం ఉదయం 8 గంటలకు అమరావతికి బస్సులు బయలు దేరతాయని, మధ్యాహ్నం 12 గంటలకు అక్కడకు చేరుకుంటాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అమరావతి నుంచి తిరుగు ప్రయాణంలో ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద అభ్యర్థులు దిగిపోవాల్సి వుంటుంది. అక్కడి నుంచి వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు సొంత ఏర్పాట్లు చేసుకోవాలి.

నియోజకవర్గాల వారీగా లబ్ధి

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	మొత్తం
చింతలపూడి	57	93	150
పోలవరం	43	72	115
గోపాలపురం	31	64	95
కొవ్వూరు	43	42	85
నిడదవోలు	20	29	49
దెందులూరు	28	27	55
ఏలూరు	43,	35	78
ఉంగుటూరు	27	23	50
ఆచంట	24	33	57
భీమవరం	26	25	51
నరసాపురం	29	43	72
పాలకొల్లు	39	28	67
తాడేపల్లిగూడెం	42	22	64
తణుకు	20	17	37
ఉండి	16	26	42
అంతర్ జిల్లా	54	25	79
మొత్తం	604	542	1146

పల్లెలు అద్దంలా.. పచ్చదనం వెల్లివిరిసేలా..

- స్వచ్ఛతా ఉత్సవం ప్రారంభం
- 15 రోజుల పాటు కార్యక్రమాలు
- ఉత్తమ పంచాయతీలకు అవార్డులు



స్వచ్ఛ ఉత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పల్లెల్లో పరిశుభ్రత, పచ్చ దనం ప్రతిబింబించేలా ఉండాలన్న సంకల్పంతో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ ఉత్సవ్ పేరుతో మొదలైంది. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమాల నిర్వ హణకు ప్రభుత్వం కార్యాచ రణ రూపొం దించింది. కార్యక్రమానికి అందరినీ సన్నద్ధం చేసేందుకు అవార్డులు అందించనుంది.

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో అపరిశుభ్రం గా ఉండే ప్రాంతాలు, స్థలాలను గుర్తించి వాటిని ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఈ పోటీల్లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కార్యక్ర మాల్లో ప్రజలు, ముఖ్యంగా యువత ను ఆహ్వానించనున్నారు. అలాగే ఎన్జీవోలను భాగస్వామ్యం చేయడం, అందులో ఉత్తమ సేవలందించిన వారికి కూడా ఈ ఉత్సవం లో అవార్డులు అందించనున్నారు. ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల సిబ్బందిని భాగస్వాములను చేశారు. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఇదీ షెడ్యూల్..

- ఈ నెల 17న స్వచ్ఛ ఉత్సవ్ ప్రచారం, ప్రతిజ్ఞ..
- 18న గృహ వ్యర్థాల విభజన, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం
- 19న పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరాలు
- 20న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్‌లు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు
- 21, 22 తేదీల్లో క్లీన్-గ్రీన్ పండగలు, జీరో వేస్ట్ వేడుకలు, మెగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ప్రత్యేక డ్రైవ్
- 23, 24 తేదీల్లో ఓడీఎఫ్+, స్వచ్ఛ సుజల్ గ్రామాల కోసం గ్రామ సభలు
- 25న ఏక్ దిన్, ఏక్ ఘంటా ఏక్ సాథ్ పేరుతో ప్రతి వ్యక్తి ఒక రోజు, ఒక గంట శ్రమ దానం చేయాలనే సంకల్పంతో శ్రమదాన కార్యక్రమం
- 26, 27, 28 తేదీల్లో యువత, ఎన్ఎస్ఎస్ విభాగాల భాగస్వామ్యంతో స్వచ్ఛత క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- 30న స్వచ్ఛత ర్యాలీలు, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమీక్ష
- అక్టోబర్ 1న గ్రామ సభలు, మోడల్ గ్రామాల ప్రకటన
- 2న స్వచ్ఛభారత్ దివాస్ నిర్వహణ, పారిశుధ్య కార్మికులకు సత్కారం, అవార్డుల అందజేత.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి యువకుడి మృతి



దెందులూరు,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని మోటా ర్ సైకిల్‌తో ఢీకొట్టడంతో ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన టైలర్ యడ్ల సింహచలం చిన్న కుమారుడు యడ్ల భరత్ సాయి(22) కాకినాడలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. భరత్ సాయి తన మేనమామ కానిస్టేబుల్ మోటా ర్ సైకిల్ వేసుకుని బుధవారం తాడేపల్లిగూడెంలో బీఫార్మసీ పరీక్షలు రాసి తిరిగి మోటార్ సైకిల్ వస్తుండగా ఉండ్రాజవరం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో భరత్ సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని దెందులూరు ఎస్.ఐ. శివాజీ పరిశీ లించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కాళ్ళ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):కాళ్ల మండలం పెదఅమిరంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పెదఅమిరం గ్రామానికి చెందిన గండి ఆనంద రావు తన భార్య శాంత కుమారి(59) కలిసి మనవడి స్కూల్ ఫీజు కట్టడానికి ద్విచక్ర వాహనంపై భీమవరం వెళ్లారు. గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో వారిని వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శాంతకుమారి అక్కడికక్కడే మృతి చెందగా ఆనందరావుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆనందరావును దగ్గరలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న కాళ్ళ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై మృతురాలి మరిది రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటుకు ముగ్గురు ఆసుపత్రి పాలు

చింతలపూడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయం సమీపంలో గుంపులుగా కుక్కలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. బుధవారం ఉదయం కుక్క కాటుకు ముగ్గురు ఆస్పత్రిపాలయ్యారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆవరణలో విద్యార్థులను కరిచే ప్రయత్నం చేయగా అడ్డుకున్న ఒక వ్యక్తికి చెంపపై కాటు వేసింది. పారిపోయే క్రమంలో ఒక ట్రాక్టర్ డ్రైవర్, ఫౌండరి వెల్డర్‌ల కాళ్లపై కరిచింది. వీరు ముగ్గురు ఆసుపత్రిపాలయ్యారు.

బాలుడి తలపై కత్తిగాట్లు.. ఎవరిపనిది?



గాయాలతో బాలుడు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏ తల్లి కన్న బిడ్డో తెలి యదు కాని 16వ నెంబర్ జాతీయ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో తలపై కత్తి గాయాలతో 12 ఏళ్ల బాలుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 48 గంటల పాటు అక్కడే పడి ఉండటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. రైతులు బుధవారం సాయంత్రం చూసి హైవే అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో బుధవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు. ఈ బాలుడు ఎవరో ఏమిటో తెలియదు. బా లుడికి గ్రహణం మొర్రి ఆపరేషన్ జరిగి ఉంది. ఈ ఘటన జరిగి సు మారు 48 గంటలు అవుతుందని అంతా భావిస్తున్నారు. ఆ బాలుడు ఎవరు, ఎందుకు అక్కడికి వెళ్లాడు, ఎవరు అంత దారుణంగా తలపై అన్ని కత్తి గాయాలు వేయాల్సి వచ్చిందనేప్రశ్నలు అంతుపట్టకుండా ఉన్నాయి. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. బాలుడి తలపై గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న ప్రదేశాన్ని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రిటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, పెదవేగి సీఐ రాజశేఖర్‌లు బుధవారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెదపాడు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తాకోడళ్లను బంధించి బంగారం చోరీ

పెనుమంట్ర, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సినీ ఫక్కీలో కత్తులతో అత్తా, కోడళ్లను బెదిరించి చోరీకి పాల్పడిన ఘటన పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లింద్రపర్రులో ఆలస్యంగా వెలుగు చూచింది. బాధితుడు కర్రి బ్రహ్మానంద రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్.ఇల్లింద్రపర్రు గ్రామంలో మంగళవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో మాజీ సర్పంచ్ కర్రి కమల ఇంట్లోకి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న అత్త, కోడలు చేతులు కట్టేసి కత్తితో బెదిరించి మెడలోని గొలుసులు, బీరువాలోని బంగారం ఆభరణాలు 48 కాసులు, లక్షా 18 వేలు నగదు, రెండు సెల్ ఫోనులు దోచుకుపోయారని అన్నారు. గట్టిగా కేకలు వేసిన చుట్టుపక్కల వారు ఎవ్వరూ రాకపోవడంతో వెళ్లిపోయారని చెప్పారు. పెనుమంట్ర పోలీసులకు బ్రహ్మానంద రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఎస్.ఐ. స్వామి దానమ్మ గుడి దగ్గర ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి నర్సాపురం డీఎస్ పి.శ్రీవేద, పెనుగొండ సి.ఐ. రాయుడు విజయ కుమార్, ఎస్ఐ స్వామి పరిశీలించి, డాగ్ స్క్వాడ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం రెండు బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్

శ్రీగంధం చెట్లు కొట్టేస్తారు..

పగలు పూసలు అమ్ముతున్నట్టు నటిస్తూ రెక్కీ.. మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠా అరెస్టు


జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పగలు రుద్రాక్షలు, పూసలు అమ్ముతూ రాత్రిళ్ల రైతుల పొలాల్లో అంతర పంటగా వేసుకున్న శ్రీ గంధం చెట్లను నరికి స్మగ్లింగ్ చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు ముఠాను అరెస్టు చేసినట్టు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవిచంద్ర వివరాలు వెల్లడించారు. వీరంతా ఊరి చివర గుడారాలు వేసుకుని పూసలు, రుద్రాక్షలు అమ్ముతున్నట్టు నటిస్తూ శ్రీగంధం చెట్లు ఎక్కడ ఉన్నాయో రెక్కీ నిర్వహిస్తూ ఉంటారని తెలిపారు.అనంతరం రాత్రి పూట శ్రీగంధం చెట్లు నరికి అపహరించుకుపోయి స్మగ్లింగ్ చేస్తారని తెలిపారు. నాలుగేళ్లుగా జిల్లాలోని టి.నరసాపురం, తడికలపూడి, చింతలపూడి, కామవరపుకోట, ధర్మాజీగూడెం, ముసునూరు, పెదవేగి మండలాల్లో శ్రీ గంధం చెట్లను దొంగిలించిన 12కేసుల్లో వీరంతా నిందితులని అన్నారు. ఈ నెల 13న కామవరపుకోట మండలం రత్నగిరి గ్రామానికి చెందిన తమ్మినేని సూర్య వరప్రసాద్ అనే రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలోకి ప్రవేశించి రైతును బెదిరించి శ్రీగంధం దుంగలతో పాటు, రైతు మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయారన్నారు ఈ ముఠాపై నిఘా పెట్టి బుధవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కటని జిల్లా హర్దువా గ్రామానికి చెందిన ఆదివాసి రాజా, ఆదివాసి ఇలాజ్ కుమార్, ఆదివాసి జెండూ, ఆదివాసి పెన్ కుమార్‌లని తెలిపారు.వీరి నుంచి 30 శ్రీగంధం చెట్ల దుంగలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆయుధాలు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సొత్తు విలువ రూ.ఐదున్నర లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసును దర్యాప్తు జరిపిన సీఐ ఎం.వి. సుభాష్, ఎస్.ఐ. చెన్నారావు, జబీర్, క్రైం పార్టీ ఏఎస్.ఐ. సంపత్, పీసీలు రమేష్, చిట్టిబాబు, షాన్ బాబులకు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ రివార్డులు ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ స్వాధీనం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న డీజిల్ ట్యాంకర్‌ను అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ట్యాంకర్ డ్రైవరు రాజేంద్ర ప్రసాద్ హైదరాబాద్‌కు చెందిన లారీ యజమాని ఎం.రాధిక వద్ద డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఏలూరు మండల చాటపర్రుకు చెందిన కోనా శ్రీనివాసరావు అనే డీజిల్ వ్యాపారి హైదరాబాదులో ట్యాంకర్‌లో 10 వేల లీటర్ల డీజిల్ నింపి భీమడోలు దగ్గరకు వచ్చి తనకు ఫోన్ చేస్తే ఎక్కడ దింపాలో చెబుతానని డ్రైవరు ప్రసాద్‌కి చెప్పాడు. దీంతో డ్రైవరు ట్యాంకరుతో బయల్దేరి మండలంలో లక్ష్మీనగర్ వద్ద కాళికాంబ అగ్రికల్చర్ సొసైటీ పెట్రోలు బంకువద్ద లారీ నిలిపాడు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం స్టేట్ ట్యాక్సు ఎఫ్‌సీ కమీషనర్ దాడి చేసి ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్యాంకర్‌ను స్థానిక వెంకటదుర్గా ఫిల్లింగ్ హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద భద్రపరిచి సివిల్ సప్లైస్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సివిల్ సప్లైస్ అధికారులు ట్యాంకర్‌ని స్వాధీనం చేసుకుని తనిఖీలు నిర్వహించారు. సివిల్ సప్లైస్ అధికారులు పరిశీలించి 10 వేల లీటర్ల డీజిల్ ఉన్నట్లు నిర్ధారించి ఎటువంటి బిల్లులు, లైసెన్సులు లేకుండా డీజిల్ అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. డీజిల్ విలువ రూ.9.74 లక్షలు ఉంటుందని ఏలూరు ఏఎస్‌వో తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ట్యాంకర్ లారీ



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

గణపవరం మండలాన్ని

‘పశ్చిమ’లోనే ఉంచాలి

మంత్రి నారాయణకు అఖిలపక్షం వినతి

గణపవరం/భీమవరం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను అఖిలపక్ష నేతలు కోరారు. బుధవారం రాజమండ్రిలో మంత్రిని గణపవరం మండల అఖిలపక్ష నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. భీమవరం జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందని ఏలూరు అయితే 70 కిలో మీటర్లు ఉండటం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామ కృష్ణంరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, గణపవరం మండల తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, జీఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ గొట్టుముక్కల సుధీర్ కుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర నాయకుడు నంద్యాల రామ లింగరాజు, రైతు సంఘం జిల్లా నాయకుడు కూసంపూడి జగపతిరాజు, గణపవరం మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు ముచ్చర్ల వేణు, వైసీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

‘అందరికీ న్యాయం’పై పోటీలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యాయ సహాయం ద్వారా అందరికీ న్యాయం అనే అంశంపైన పోటీలు నిర్వహిస్తున్నామని ఆసక్తి కలవారు పాల్గొనవలసిందిగా ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి పైన తెలిపిన అంశంపై ఫోటోగ్రఫీ, పెయింటింగ్, స్కెచ్ వీడియోలను తమ పాఠశాల యాజమాన్యం ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనానికి వచ్చే నెల 3వ తేదీలోగా అంద జేయాలని సూచించారు. సామాన్య పౌరులు, సామాజికవేత్తలు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు, వివిధ సంస్థలు పని చేసే అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనవచ్చునని, వీటిని అమరావతిలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు పంపుతామన్నారు.

24న వాహనాలకు వేలం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రవాణా శాఖ సీజ్ చేసిన రవాణా, రవాణేతర వాహనాలకు ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వ హించనున్నట్లు ఉపరవాణా కమీషనర్ షేక్ కరీమ్ బుధవారం తెలిపారు. నూజివీడు ఏపీఎస్ ఆర్టీసీ డిపో, ఎంవీఐ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనరు కార్యాలయంలో చొదిమెళ్ల, ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఏలూరులో వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని డీటీసీ తెలిపారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు ధరావత్తుగా రూ.5000 క్యాష్ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని, పూర్తి చిరునామాతో కూడిన ఆధార్ కార్డు నకలును అందజేయాలని అన్నారు.



కునుకుతీశాడంతే.. లారీ బోల్తా

పెనుమంట్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పొలమూరు శివారు బ్రాహ్మణ చెరువు శివారు రోడ్డు పక్కన ఒక లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నుంచి వీరవాసరం వెళ్తున్న లోడు లారీ బోల్తా కొట్టింది. డ్రైవర్‌కు కునుకు రావడంతో సడన్ బ్రేక్ కొట్టగా లారీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఎరువుల దుకాణంపై దాడి

ఏలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. కైకలూరు మండలం ఏటూ జెడ్ ఆక్వా రైతు బజార్, వాసవీ ఆక్వా రైతు బజార్లల్లో తనిఖీ చేయగా, ఏ టూ జెడ్ ఆక్వా రైతు బజార్‌లో లక్షా45వేల260 విలువైన 10.800 టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి వాటిని సీజ్ చేశారు.షాపు యజమానిపై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఏ)కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఆచంట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఐందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. ఐటీఐలో ప్రవేశం కోరే విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్లను ఈ నెల 22 నాటికి కళాశాలలో అందజేయాలన్నారు. ఈ నెల 29న కౌన్సెలింగ్ జరుగుతుందని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9490111002 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కాటాలకు సీల్ వేసిన తూనికలు, కొలతల అధికారులు

ఆచంట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజూ రేషన్ షాపు డీలర్లు కాటా యంత్రాన్ని ఐదు కేజీల రాయితో సరి చూసుకున్న తరువాతే అమ్మకాలు నిర్వహించాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు సూచించారు. మండలంలో రేషన్ షాపుల కాటాలకు సీల్ వేసే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రేషన్ డీలర్లు విధిగా ఆయా దుకాణాలలో తూనికలు, కొలతల శాఖ సర్టిఫికెట్లు ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి. కనకరాజు, సిబ్బంది గణేశ్, తదితరులు పాల్గొన్నారు

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దాసాంజనేయస్వామి ఆలయ ధర్మకర్తలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దారపురెడ్డి త్రివిక్రమ రామారావు, మెంటే మనోజ్, గుండం రాదా కుమారి, వేలూరి సుబ్రహ్మణ్యం, ములుగుర్తి శ్రీనివాసరావు, యర్రంశెట్టి గౌతమి, ఐయ్యప్ప మాదవి చేపాద లక్ష్మీలతో ఈవో తోట శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్‌గా దారపురెడ్డి త్రివిక్రమరావు ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, తోట సీతారామలక్ష్మి, కోటికలపూడి గోవిందరావు, మెంటే పార్థసారథి, కలిదిండి సుజాత, వేండ్ర శ్రీనివాస్, బండి రమేష్ కుమార్, చనమల్ల చంద్రశేఖర్, ఐందుకూరి రామలింగరాజు, గునిశెట్టి త్రినాథ్, గంటా త్రిమూర్తులు, ఉప్పులూరి చంద్రశేఖర్, ఎండి.షమీనా, పదిలిశెట్టి రామకృష్ణ, మాదాసు కనకదుర్గ, మద్దుల రాము, నల్లబోయిన గోవింద్ వానపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

వీరవాసరం (భీమవరం టౌన్): వీరవాసరం మండలం కొణితివాడ వేణుగోపాలస్వామి ఆలయ పాలకవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా యరకరాజు వెంకట్రామరాజు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. తోట సీతారామలక్ష్మి, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

సర్వేలు బాధ్యతగా నిర్వహించాలి : డీఎల్‌డీవో

ఆచంట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వేలు బాధ్యతగా నిర్వహించాలని నరసాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి జి.రాజ్ అన్నారు. ఆచంట సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన సమీక్షలో మాట్లాడుతూ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు, ఇతర కార్యక్రమాలు విధిగా చేయాలన్నారు. వివిధ సర్వేల ప్రగతి పై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో బి. కృష్ణమోహన్, డిప్యూటీ ఎంపీడీవో బుల్లి సూరన్న, కార్యదర్శి నాగబాబు పాల్గొన్నారు.

మురికి కాల్వ తవ్వాలని రైతుల ఆందోళన

నరసాపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పసలదీవిలో వెస్ట్ కొక్కిలేరు మురికి కాల్వ ఆధునీకరించాలని రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. కాల్వ పూడికతో ముంపు నీరు లాగక వందలాది ఎకరాల్లో సాగు దేయలేకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూడిక తొలగింపు పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. కొట్టు సత్యనారాయణ, పులపర్తి శ్రీను, కొట్టు వెంకట్రావు, లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, జానకీరామ్, ఏసురాజు, కంచుపాటి శ్రీనివాస్, శివానందం పాల్గొన్నారు.

రహదారిపై గోతులను పూడ్చండి

పెనుమంట్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై గోతులు పూడ్చడానికి చర్యలు చేపట్టాలని పొలమూరు అఖిలపక్ష నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. పొలమూరు శివారు నవుడూరు సెంటర్ వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో ప్రయా ణికులు అవస్థలు పడుతున్నారని ఆదేద వ్యక్తం చేశారు. చింతపల్లి గురు ప్రసాద్, మేనేడి సత్యనారాయణ, కొల్లాల మధు కుమార్, కేతా గోపాలన్, తూటే సురేష్, రాపాక ఆశీర్వాదం, తాడిపర్తి నరేంద్ర, పిల్లి రాజకుమార్, పిల్లి శ్రీనివాస్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తాడేపల్లిగూడెంగా తీర్చిదిద్దండి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ తాడేపల్లిగూడెంగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాలూకా ఆఫీస్ సెంటర్ వద్ద బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమ ఉద్దేశం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. తెలుగు మునిసిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈతకోట తాతాజీ, చిట్యాల రాంబాబు, కొనకళ్ల హరనాద్, గుండుమోగుల సురేష్, మునిసిపల్ మేనేజర్ ఎం రవి సుధాకర్, ఎంత వైవీరమణ, భవాని, విశాలాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలంతా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అప్పుడే మనమంతా ఆరోగ్య జీవనం సాగించగలమని ఎంపీడీవో ఎం.వెంకటేశ్వ పేర్కొన్నారు. మండలంలోని కొమ్ముగూడెంలో స్వచ్ఛతా హీసేవా కార్యక్రమం సర్పంచ్ తాడేపల్లి బేబి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, ప్రజలతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి ఎ వాణి, ఎంఈవోఎస్ ఎం.రవికిరణ్, తాడేపల్లి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్ : రూ. 92 వేలు స్వాధీనం

కాళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పెద అమిరం రొయ్యలచెరువుల్లో మంగళవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. చిన అమిరం గ్రామానికి చెందిన దంతులూరి కిశోర్ రాజు, మరో ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.92,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వెండి వస్తువులు అపహరణ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లోకి చొరబడి వెండి వస్తువులు అపహరించిన ఘటన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో బుధవారం వెలుగుచూసింది. పెదతాడేపల్లికి చెందిన బలుసు కేశవరావు ఈనెల15న కుటుంబ సభ్యులతో కలిసి ఊరు వెళ్లారు. బుధవారం ఇంటి గేటు తీసి ఉండడం గమనించి స్థానికులు కేశవరావు ఆడే గ్రామంలో నమీప బంధువు బలుసు సతీష్ చౌదరికి సమాచారం ఇచ్చారు. తాళం పగలకొట్టి రూ.50వేలు విలువైన వెండి చెంబు, వెండి పళ్లెం అపహరించినట్టు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

రోగులు ఎక్కువ.. సిబ్బంది తక్కువ

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు నిర్వహించాలంటే ల్యాబ్ టెక్నీషియన్ అవసరం. పెంటపాడు పీహెచ్‌సీలో ఉండే ల్యాబ్ టెక్నీషియన్ వారానికి మూడు రోజులు మాత్రమే ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రోజులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని వేరే ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తున్నది. దీంతో వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా పీహెచ్‌సీలలో ఫార్మాసిస్ట్‌ల కొరత ఉంది. ఉన్న వారిని వేరే పనుల నిమిత్తం వేరే ప్రాంతాలకు పంపుతున్నారు. పీహెచ్‌సీలలో ఉన్న సిబ్బంది వచ్చిన రోగులకు మందులు అందజేస్తున్నారు.

పెంటపాడులో దయనీయం

పెంటపాడు పీహెచ్‌సీ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పెంటపాడులో గేటు సెంటర్ వద్ద పీహెచ్‌సీ ఉంటుంది. ఐదు మూడు రహదారులను కలిపే ప్రధానమైన కూడలిలో ఉండటం వల్ల ఈ పీహెచ్‌సీకి ప్రతీ రోజు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇదే పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. దీంతో ఆసుపత్రి వచ్చే రోగులతోపాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో వచ్చిన రోగులను ఓపీ ప్రకారం డాక్టర్ గదిలోకి పంపించేందుకు కనీసం అటెండర్ కూడా లేదు. ఒక లేడీ డాక్టర్, ఒక మగ డాక్టర్ వైద్యసేవలు అందిస్తున్నారు. ట్రైనింగ్‌లో పీహెచ్‌సీలో ఉండే లేడీ డాక్టర్లను ట్రైనింగ్‌కు అంటూ తిప్పడంతో మహిళా రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై డీఎంహెచ్‌వో గీతాబాయిని వివరణ కోరగా ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉండటం వాస్తవమన్నారు. దీనిపై రీజనల్ డైరెక్టర్‌కు నివేదిక అందజేశామన్నారు. ఈ నెలాఖరుకు ఆసుపత్రిలో సిబ్బంది కొరత లేకుండా చేసే అవకాశం ఉందన్నారు.


పాలకొల్లులో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు


భీమవరంలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు


మొగల్తూరులో రక్తపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే నాయకర్

మహిళల ఆరోగ్య పరిరక్షణకు
ప్రత్యేక వైద్య శిబిరాలు

పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు బలపడతాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. సూపరింటెండెంట్ యర్రా మాధురి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిమ్మల మాట్లాడుతూ పనిచేసే వారి జీవన ప్రమాణాలు మెరుగు పరచాలన్నదే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పెచ్చెట్టి బాబు, గుండేటి వెంకటేశ్వరరావు, చినమిల్లి గణపతిరావు, ఉన్నమట్ల కబర్ది, అల్లూరి వద్ద, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం టౌన్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ నారీ సశక్త్ పరి వార్ అభియాన్ పేరిట ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కుటుంబమంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గ్రామస్థులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

తణుకు: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్, వల్లూరి గంగయ్య, నార్ని తాతాజీ, పలువురు వైద్యులు, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతోనే ప్రభుత్వం పనిచేస్తుందని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి జి రూప దేవి అన్నారు. కడియద్దలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ యాతం కోటేశ్వరం ప్రారంభించారు. 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక ఆహారం మేళా ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ఎం.వెంకటేష్, యాతం బూరయ్య, కార్యదర్శి కె శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట: సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్య కుమారి, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దార్ కనకరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు: ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయానుకూల వైద్య సేవలు అందించడం, జీవన ప్రమాణాలు పెంపొందించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. వైద్యులు కె.లక్ష్మి పార్వతి, జి.హేమ, సీడీపీవో బి.తులసి, తహసీల్దార్ రాజకిషోర్, ఎంపీడీవో త్రిశూలపాణి, నిమ్మలేటి తారక రామారావు, బొల్లా చంటి, బోణం నర్సింహారావు, పాల్గొన్నారు.

పెనుగొండ: మహిళా ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని సర్పంచ్ నక్కా శ్యామలాసోని శాస్త్రి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలన్నారు. వైద్యులు మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు, గర్భిణులకు వైద్య సలహాలు ఇస్తారన్నారు.

కాళ్ల: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్.రంగనాయుడు కోరారు. ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, ఆరేటి వెంకటరత్న ప్రసాద్, వైద్యాధికారులు నరాలు సునీల్, టి.భావన, తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీవో జి.స్వాతి, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అత్తిలి: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్ అన్నారు. పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాధులను తొలి దశలో గుర్తించి మందులతో నివారణ పొందవచ్చన్నారు. వైద్యులు కె నాగరాజు, ఆర్.సురేఖ, వేద, సీటి సంఘం అధ్యక్షుడు నల్లూరి సురేష్, కొపల్లి ప్రసాద్, ఆర్తి అజయ్, నాగబాబు, ప్రభు, ఎంపీడీవో పి.శామ్యూల్, వైద్య సిబ్బంది జెఐస్ గనిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: కావలిపురంలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ వనచర్ల అన్నస్వామి ప్రారంభించారు. రేలంగి పీహెచ్‌సీ డాక్టర్ విజయకుమార్ వైద్య పరీక్షలు చేశారు. జనసేన లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ సత్యసాయి, డాక్టర్ నవ్యజీవన్ బుధవారం నిర్వహించిన ఈకార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల విజయకుమార్, హెచ్‌వీ, హెచ్‌ఎస్ ఎలిజబెత్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



లక్ష్మణేశ్వరం సొసైటీ చైర్మన్‌గా చాగంటి పార్థసారథి, రాపాడు సొసైటీ చైర్మన్‌గా ములగాల శివకేశవ, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

రైతులకు సేవలందించేందుకు సొసైటీలు ముందుండాలి

నరసాపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించేందుకు సొసైటీ పాలకవర్గాలు ముందుండాలని ఎమ్మెల్యే నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. లక్ష్మణేశ్వరం సొసైటీ చైర్మన్‌గా చాగంటి పార్థసారథి ప్రమాణస్వీకారానికి బుధవారం వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతులకు ప్రభుత్వ రాయితీలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలన్నారు. అనంతరం కార్యదర్శి ముదునూరి సత్యనారాయణరాజు చైర్మన్ పార్థసారథి, సభ్యులు దొంగ రాములక్ష్మి, వెంకటేశ్వరరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీ కృష్ణ, ఆర్డీవో దాసిరాజు, డీఏవో సంకు మురళీకృష్ణ, డీఆర్ శ్రీనివాస్, కలవకొలను తాతాజీ, వెన్నా బాబూరావు, సంకు భాస్కర్ పాల్గొన్నారు.

రావిపాడు సొసైటీ చైర్మన్‌గా శివకేశవ

పెంటపాడు: త్రిసభ్య కమిటీ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రావిపాడు సొసైటీ చైర్మన్ ములగాల శివకేశవ, డైరెక్టర్లుగా మట్టా నాగేశ్వరరావు, ఆయితం శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, పుల్లా బాబీ, వర్తనపల్లి కాశీ, కాజులూరి దుర్గామల్లేశ్వరరావు, ములగాల బాబ్జి, సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, ములగాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


మంత్రిరావు బాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

రెరా సభ్యుడిగా మంత్రిరావు ప్రమాణ స్వీకారం

తణుకు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెరా సంస్థకు సభ్యుడుగా తణుకు పట్టణానికి చెందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు మంత్రిరావు వెంకటరత్నం (బాబు) బుధవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మంత్రిరావును అభినందించారు. పరిమి వెంకన్నబాబు, అజాబాబు, కలగర వెంకటకృష్ణ, గూడపాటి వెంకట్రావు, కొండేటి శివ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

భీమవరం క్రైం/తణుకు/తణుకు రూరల్/పెనుగొండ/పాలకొల్లు అర్బన్/అత్తిలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మను ప్రపంచంలో మొట్టమొదటి వాస్తుశిల్పిగా భావిస్తారని ఎస్పీ వి.విమాధనరావు అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి ఎస్పీ వి.విమాధనరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

తణుకు పోలలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ యజ్ఞోత్సవాలు బుధవారం ప్రారంభించారు. ఆలయ చైర్మన్ తమిరి శ్రీని వాసు విశ్వకర్మ పతాకావిష్కరణ చేశారు. తణుకు మండల విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు జరిగిన కార్యక్రమంలో పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, విశ్వ కర్మ ఫూజ కౌన్సిల్యాన్ని వివరించారు. ముందరాపు నాగ మనోహర్, వసంతాల వజి కుమార్, సాంబశివరావు, చిక్కాల సూర్యనారాయణ, కొర్నాద సాంబ, మంకు దుర్గారావు, మందరాపు సాయిబాబా, గురజాపు శ్రీనివాస్, జనార్దన్, అచ్యుత, విజయ్ తదితరులు పాల్గొన్నారు. పెనుగొండ కామాక్షి దేవి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. సిద్ధాంతంలో విశ్వకర్మ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. విజయవరపు సూర్య ప్రకాశరావు, కీర్తి కుమార్, తిరుమల బుజ్జి, ముదునూరి రామారావు, కీర్తి వీరబ్రహ్మం, మహిళలు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు. అత్తిలిలో పట్నాల వెంకటేశ్వరరావు, అనపోజు అప్పలాచార్య, వీరాచార్యులు పాల్గొన్నారు. అచ్యుతస్వామి పాలెం సాయి గాయత్రి ఆలయంలో విశ్వకర్మ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పాలకొల్లు పట్టణ, మండల విశ్వ బ్రాహ్మణ సంఘం, పట్టణ స్వర్ణకార సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూజలు, అఖండ దీపారాధన అనంతరం విశ్వకర్మ పతాకాన్ని నాగులకొండ గోపి సత్యనారాయణ, శాంతిరత్న దంపతులు ఆవిష్కరించారు. విజయరపు శంకరం, గురజాపు లాల్, కర్రి మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, లక్కోజు బాబ్జి, గోపి, జీఎస్ఎన్, వర్దప్రసాద్, పట్నాల కిషోర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

శృంగవృక్షంలో రాష్ట్రీయ పోషణ మాసం

పాలకోడేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శృంగవృక్షంలో సర్పంచ్ జంగం సూరిబాబు అధ్యక్షతన ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. బాల్యదశ, సంరక్షణ, శిశు, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లపై నిశితంగా పరిశీలించాలని అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కెసూర్యకుమారి, ఎస్.సరస్వతి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంటపాడు: చిన్నారులకు చిన్నతనం నుండే పోష్టికాహారాన్ని అందించాలని పీహెచ్‌సీ డాక్టర్ తోట రాజేష్‌కుమార్, డాక్టర్ మౌనిక అన్నారు. జట్లపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, సుజాత పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

నరసాపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో అమృత్ మహోత్సవంలో భాగంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ మెగా రక్తదాన శిబిరం ఎమ్మెల్యే నాయకర్ ప్రారంభించారు. సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. చైర్మన్ కేవీసత్యనారాయణ, కొవ్వలి కరి, డైరెక్టర్ ఆల్లూరి శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, గోపిచంద్, స్వామినాథన్, మాణిక్యాలరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

చేలల్లో ఎలుకల నిర్మూలన చేపట్టాలి

మొగల్తూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వరి చేలల్లో సామూహిక ఎలుకల నిర్మూలనకు రైతులు కృషి చేయాలని ఏవో అబ్దుల్ రహీమ్ సూచించారు. మండలంలో బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు, రామన్నపాలెం, కేపీపాలెం, పేరుపాలెం గ్రామాల్లోని వరి రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. సర్పంచ్ వరవల మేరీ, కవురు నాగేశ్వరరావు, యాతం పొందురంగారావు, వెలిది నాగేశ్వరరావు, పిప్పళ్ల ఏడుకొండలు, కడిమి ఏసు పాల్గొన్నారు.

పెనుగొండ: వడలిలో సొసైటీలో ఎలుకల నివారణ మందు రైతులకు అందజేశారు. ఏవో స్పందన రైతులకు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో సూర్య ప్రకాష్, సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ఉప్పలపాటి చంటి, అంగర వర ప్రసాద్, సొసైటీ చైర్మన్ కట్టా వెంకట రామకృష్ణ, సంకురాత్రి నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

అత్తిలి: బొంత వారిపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో టీకే.రాజేష్ మాట్లాడుతూ రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని సూచించారు. రైతులందరూ యూరియా వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. యూరియా అధిక శాతం మొక్కకు అందకుండా వివిధ రూపాల్లో వ్యర్థంగా పోతుందన్నారు. రైతులందరూ నానో యూరియా పట్ల అవగాహన పెంచుకుని నానో యూరియా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గాయత్రి, దుర్గ, ఏతవో శివశేఖర్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.


పాలకొల్లు క్షీరారామంలో బీజేపీ నాయకుల పూజలు


తాడేపల్లిగూడెంలో కేక్ కట్ చేస్తున్న నేతలు


టీడీఆర్ స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న భోగేశ్వరరావు

మోదీ నాయకత్వం స్ఫూర్తిదాయకం
పుట్టినరోజు వేడుకల్లో వక్తలు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోదీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్‌కట్ చేసి కూటమి నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ, కూటమి నాయకులు నరిసే సోమేశ్వరరావు, దువ్వా శ్రీనివాస్, వర్తనపల్లి కాశీ, నీలపాల దినేష్, తేజ, గుండుమోగుల సురేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: బీజేపీ మండల అధ్యక్షుడు నమయమంతుల కాశీ అధ్యక్షతన ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. నీలాద్రిపురం, దండగర్ర, కడియద్ద ఆలయాల్లో పూజలు చేశారు. నరిసే సోమేశ్వరం సత్యనారాయణ, పత్తా రామకృష్ణ, దూనబోయిన శ్రీను, నల్లూరి శ్రీనివాస్, నూనె రాద, పసుపులేటి శ్రీను పాల్గొన్నారు.

కాళ్ల: మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పానకాల కృష్ణ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మోదీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బోజనాలు అందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరా రామ్మూర్తి, సుంకర కాశీ విశ్వేశ్వరరావు, కటిబిడ్డి కనకదుర్గ, అమిరపు నాగరాజు, యాతం సుబ్బారావు, నిమ్మల దేవేంద్రకుమార్, బాలువు వెంకటేశ్వరరావు, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు: మోదీ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కొమ్మాయి చెరువుగట్టు వద్ద పార్కు పునరుద్దరణ పనులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. పాలకొల్లు కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి ఆహార పొట్లాలు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, కలగర వెంకటకృష్ణ, దొమ్మేటి వెంకట సుదాకర్, పితాని మోహన్, బసవా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: మోదీ పుట్టిన రోజు సందర్భంగా క్షీర రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కెకెండ ప్రసాద్, జక్కంపూడి కుమార్ ఉన్నమట్ల కబర్ది, మామిడి సర్వనాయకులు అల్లూరి పద్మ, పవన్, చెరుకూరి శ్రీనివాస్, మల్లపోలు సురేష్, పులఖంది కీర్తిచంద్, బోడా కనక రాజు, ఖైలా శ్రీధర్, సూరిబాబు, వి సరసింహమూర్తి, మల్లికార్జున రెడ్డి, నాగలక్ష్మి, జగదీష్, గాదె సుబ్బారావు, వి దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: మోదీ జన్మదినం సందర్భంగా గణపవరం, పిప్పర ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. గణపవరంలో నరేంద్ర మోదీ పుట్టినరోజు కేకు కట్‌చేశారు. దండు రామచంద్రరాజు, ఐందుకూరి ఆశోకవర్మ చక్రవర్తి, వర్మ, కొయ్యల వెంకట సుబ్బారావు, తోట శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పెంటపాడు: దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీ తోనే సాధ్యమని టీడీఆర్ సంస్థ చైర్మన్ తెనాలి భోగేశ్వరరావు అన్నారు. అలంపురం టీడీఆర్ సైనిక్ పాఠశాలలో కేక్ కట్ చేశారు. కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో వెంకటేశ్, కళ్యాణి, నాగరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర: మండలంలో పలు ఆలయాల్లో మోదీ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. మార్టేరు సెంటర్‌లో కేక్ కట్ చేశారు. మారుతి కృష్ణ, ప్రసాద్ రెడ్డి, ఆకేటి వెంకటరావు, శ్రీనివాసరెడ్డి, అప్పలాచార్యులు, బాసుప్రసాద్, పృధ్వీరాజ్, చంద్రరావు, పాలా ప్రసాద్, రామకృష్ణ, కనక రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పిప్పిని ప్రసాద్, కె.సుబ్రహ్మణ్యం, అడబాల శ్రీను పాల్గొన్నారు.